సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం | 14 | ఏప్రిల్ | 2023



మార్కెట్లో రైతుల గోస
ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులు వాటిని అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.
- 8లో▸



బీజేపీ నిరుద్యోగ మార్చ్ హాస్యాస్పదం
అభివృద్ధి పట్టని బీజేపీ నాయకులు నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తామనడం హాస్యాస్పదం అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్ రెడ్డి అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
42.5° /24.0°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

ఇఫ్తార్	సహర్
శుక్ర 6:37	శని 4:36

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

16న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని మోడల్ పాఠశాలల ప్రవేశ పరీక్ష ఈ నెల16న నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాం కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి ప్రవేశానికి, 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లను భర్తీ చేయడానికి ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం ఆరవ తరగతికి ప్రవేశ పరీక్ష ఉదయం 10గంటల నుంచి 12 వరకు 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2గంటల నుంచి 4వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల పంచాయతీ పరిధిలో జయశంకర్‌భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్‌లు జక్కు శ్రీహర్షిణి, పుట్ట మధుకర్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. వారి వెంట ఎంపీపీ రాణిబాయి, జక్కు రాకేష్, సర్పంచ్ లక్ష్మయ్య ఉన్నారు.

జెడ్పీ సీఈఓ బాధ్యతల స్వీకరణ



భూపాలపల్లి రూరల్: జెడ్పీ సీఈఓగా ఎల్.విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులతో, సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సీఈఓ రఘువరన్, కార్యాలయ సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



మల్హర్: తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మండలంలోని తాడిచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని శాత్రాజపల్లి గ్రామంలో ప్రజలు ఖాళీ బిందెలతో గురువారం నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో నిర్మించిన పంచాయతీ బోరు కొన్ని నెలల క్రితం చెడిపోయిందన్నారు. మిషన్ భగీరథ నీరు కూడా సక్రమంగా రాకపోవడంతో 20 రోజులుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం




భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలోని విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు టీఎస్ యూటీఎఫ్ ముందుండి పోరాటం చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘుపతిరెడ్డి, శనిగరపు రమేష్ అన్నారు. గురువారం సంఘం 10వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రంలో సంఘం జెండాను అధ్యక్షుడు రఘుపతిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అనేక సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్ పనిచేస్తోందన్నారు. ఐక్య ఉద్యమాలకు కూడా సంఘం నాంది పలికిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రామ్ నాయక్ , మల్లికార్జున్, తిరుపతి, ఈశ్వరాచారి, సంపత్ ,రాజు, సదయ్య, వందన పాల్గొన్నారు.

అభాగ్యులకు చేయూత



దరఖాస్తుకు ఏం కావాలి..

దరఖాస్తు చేసుకునేందుకు బాలుడి /బాలిక జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, కుల ధ్రువీకరణ పత్రం, పాస్ ఫొటో. తల్లిదండ్రుల ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు ఈ సంవత్సరం స్టడీ సర్టిఫికెట్ జతచేసి దరఖాస్తు చేసుకోవాలి.



'మిషన్ వాత్సల్య' పేరిట సాయం
- నెలకు రూ.4వేలు అందజేత
- ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే వారికి మాత్రమే..
- రేపటివరకు దరఖాస్తు చేసుకునే అవకాశం

భూపాలపల్లి రూరల్: విధి వంచితులు, ఎలాంటి ఆదరణ లేని అభాగ్య బాలలకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం 'మిషన్ వాత్సల్య' పేరిట సాయం చేస్తుంది. కేంద్ర, స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ఈ పథకంలో 60శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం సాయం అందజేస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే బాలలకు నెలకు రూ.4వేలు సాయం చేస్తోంది. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15వరకు మాత్రమే అవకాశం ఉంది.

బాలల న్యాయ (రక్షణ–ఆదరణ) చట్టం -2015 ప్రకారం నిస్సహాయ స్థితిలో ఉన్న 6 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలు మిషన్ వాత్సల్యం పథకానికి అర్హులు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న బాలలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. సహాయం, ఆశ్రయం కావలసిన బాలలు దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 15వ తేదీ శనివారం సాయంత్రం వరకు సమీపంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో అందజేయాలని అధికారులు సూచిస్తున్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం లేదా బాలల పరిరక్షణ విభాగం అధికారులను సంప్రదించాలని తెలిపారు. విధి వంచితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఎటువంటి ఆదరణ లేక అభాగ్యులుగా మిగిలిన పిల్లలకు చేయూతనిచ్చేందుకు చర్యలు చేపడుతోంది. పిల్లల విద్య, వైద్య మరియు అభివృద్ధి అవసరాలు తీర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పేరిట స్పాన్సర్‌షిప్ అందిస్తున్నాయి. నిరాదరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని చేపట్టారు. పిల్లలకు నెలకు రూ.4వేలు అందిస్తున్నారు. ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లల వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.72వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96వేలు మించకూడదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో..

మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేసేందుకు కేంద్రం 60 శాతం అంటే రూ. 2400, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం రూ.1600 నిధులు సమకూరుస్తుంది. బాలలను ఏదైనా వసతి గృహం, లేదా బాల సదనంలో చేర్పించిన తర్వాత సహాయం నిలిపివేస్తారు. ప్రత్యేక అవసరాలు కలిగిన బాలల విషయంలో మినహా, పాఠశాలలకు వెళ్లే వారు హాజరు సక్రమంగా లేకుంటే స్పాన్సర్‌షిప్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తారు. స్పానర్ షిప్ కమిటీ వారు ప్రతి సంవత్సరము ఈ పథకాన్ని సమీక్షిస్తారు.

దరఖాస్తు చేసుకోవాలి



మిషన్ వాత్సల్య పథకానికి సంబంధించిన దరఖాస్తులు ఈనెల 15వ తేదీ సాయంత్రం వరకు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమర్పించాలి. జిల్లాలోని అనాథలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. స్వీకరించిన దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపిస్తాం.

- టి.శైలజ, జిల్లా ఇన్‌చార్జ్ సంక్షేమాధికారి

కార్మికులను మోసంచేస్తున్న టీబీజీకేఎస్


కార్మికులతో మాట్లాడుతున్న అప్పాని శ్రీనివాస్

భూపాలపల్లి అర్బన్: ఉద్యమం ముసుగులో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌తో పాటు తెలంగాణబొగ్గు గని కార్మిక సంఘం సింగరేణి కార్మికులను మోసం చేస్తుందని బీఎంఎస్ భూపాలపల్లి ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అప్పాని శ్రీనివాస్ ఆరోపించారు. ఏరియాలోని కేటీకే 5గనిలో గురువారం గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికుల సమస్యలను తెలుసుకొని మాట్లాడారు. స్వరాష్ట్రం కోసం 35రోజులు సకలజనుల సమ్మె చేసి అనేక పోరాట ఆందోళన ఆత్మబలిదానాలతో సాధించుకున్న తెలంగాణలో నేడు జరుగుతున్నది కార్మికులందరికీ తెలుసన్నారు. సింగరేణిలో కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న దోపిడీ, అవినీతి, సింగరేణి లూటీ చేస్తుంటే తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. సింగరేణి కార్మికులకు ఏం న్యాయం చేశారో చెప్పాలని, సింగరేణికి నూతన బొగ్గుబాయిలు రాకుండా అడ్డుకుంటున్నది రాష్ట్ర ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఘుపతి రెడ్డి, రమేష్, శ్రీనివాస్, ఓదెలు, దేవేందర్ పాల్గొన్నారు.

అవినీతి పాలనను అంతంచేయాలి


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న చందుపట్ల కీర్తిరెడ్డి, నాయకులు, విద్యార్థులు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి
- నిరుద్యోగ మార్చ్ పోస్టర్ ఆవిష్కరణ

భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో అవినీతి బీఆర్ఎస్ పాలనను అంతం చేసేందుకు నిరుద్యోగ యువతతో పాటు, అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలో పార్టీ అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో నిరుద్యోగ మార్చ్ ఫిరో వరంగల్ వాల్‌పోస్టల్ ఆవిష్కరణ చేశారు. అనంతరం కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి సంబంధించిన బాధ్యులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నుంచి భారీ సంఖ్యలో నిరుద్యోగులు తరలి వచ్చి మార్చ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కన్నం యుగంధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల గణపతి, అర్బన్ ప్రధాన కార్యదర్శి తుమ్మేటి రాంరెడ్డి, అర్బన్ ఉపాధ్యక్షుడు కోరే సుధాకర్, అర్బన్ మహిళా అధ్యక్షురాలు కదారి మాలతి పాల్గొన్నారు.

యువత తరలిరావాలి


సమావేశంలో మాట్లాడుతున్న శశికుమార్

భూపాలపల్లి రూరల్ : హనుమకొండలో ఈనెల 15న నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌కు యువత తరలి రావాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గొర్రె శశికుమార్ పిలుపునిచ్చారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా నాయకులు భగవాన్, మధుకర్, సాయికుమార్, సందీప్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో సౌకర్యాలు కల్పించాలి


కళాశాలను పరిశీలిస్తున్న అప్పం కిషన్

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వారికి సౌకర్యాలు కల్పించాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ డిమాండ్ చేశారు. నాయకులతో కలిసి గురువారం ఆయన కళాశాలను సందర్శించారు. అనంతరం కిషన్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అరకొర వసతులతో నడుస్తోందన్నారు. తాగునీటి వసతి లేదని, తరగతి గదులు, ఆవరణం అపరిశుభ్రంగా ఉన్నాయని చెప్పారు. మరుగుదొడ్లు దుర్వాసన వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిర్మించిన హాస్టళ్ల ప్రారంభించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రిన్సిపల్ వైఖరితో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తుందన్నారు. కలెక్టర్, రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ వెంటనే స్పందించి డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కస్తూరి రమేష్, మధుకర్ రెడ్డి, నరేష్, క్రాంతి, మోహన్, రమేష్, ప్రసాద్, నరేందర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె


మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

గణపురం: ఈనెల 16వ తేదీలోపు తమ సమస్యలు పరిష్కరించకుంటే 17న సమ్మెకు దిగుతామని (టీఎస్‌పీఈజేఏసీ) తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు హెచ్చరించారు. మండలంలోని ఏఎస్సార్ గార్డెన్‌లో గురువారం టీఎస్‌పీఈజేఏసీ ఆధ్వర్యంలో 8వ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీఎస్‌పీఈజేఏసీ చైర్మన్ జి.సాయిబాబు, కన్వీనర్ పి.రత్నాకర్‌రావు, కో చైర్మన్ శ్రీధర్, నాయకులు అనిల్‌కుమార్, వజీర్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2004వరకు ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర జేఏసీ నాయకులు, ఉద్యోగులు, ఆర్టిజన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పకడ్బందీగా ఉత్సవాల ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి


అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి, పక్కన ఎస్పీ గాష్ ఆలం

ములుగు: ఈ నెల 18వ తేదీన రామప్ప ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న ప్రపంచ వారసత్వ ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఇలా త్రిపాఠి అధికారులకు ఆదేశించారు. ఎస్పీ గాష్ ఆలం, ఓఎస్డీ అశోక్‌కుమార్‌లతో కలిసి గురువారం కలెక్టరేట్‌లో ఉత్సవాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇలా త్రిపాఠి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంగా పనిచేయాలని సూచించారు. హ్యాండ్ క్రాఫ్ట్ వెజిటేరియన్ స్టాల్స్ ఏర్పాటుకు సన్నద్ధం కావాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. వీఐపీ, వీవీఐపీ వాహనాల పార్కింగ్‌లు వేర్వేరుగా ఉండేలా చూడాలని అధికారులను సూచించారు. పాలంపేట, రామప్ప దేవాలయ పరిసర ప్రాంతాల్లోని పిచ్చిమొక్కలను తొలగించి శానిటేషన్ పనులు నిర్వహించాలని అన్నారు. పర్యాటకుల సౌకర్యార్థం మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారులకు సూచించారు. రామప్ప దేవాలయం దేదీప్యమానంగా వెలిగేలా ఆలయ ప్రాంగణం అంతా విద్యుత్ వెలుగులతో అలంకరణ చేయాలని, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి, డీఆర్‌డీఓ నాగపద్మజ, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, డీపీఓ కొండా వెంకయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేష్, విద్యుత్‌శాఖ డీఈ నాగేశ్వర్‌రావు, అగ్నిమాపక అధికారి ఎండీ అబ్దుల్ రహీం, డీపీఆర్వో రఫిక్, తహసీల్దార్లు మధురకవి సత్యనారాయణస్వామి, మంజుల, ఎంపీడీఓ ఇక్బాల్ హుస్సేన్, ఎంటీఎస్ కుమారస్వామి, సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై తాజోద్దీన్ పాల్గొన్నారు.

అంత్యపుష్కరాలపై పట్టింపేది!

ప్రాణహిత పుష్కరాలకు ఏడాది..


కాళేశ్వరం వద్ద ప్రాణహిత, గోదావరి నదులు

కాళేశ్వరం: గతేడాది ఏప్రిల్ 13 నుంచి 24 వరకు 12 రోజుల పాటు ప్రాణహిత నదికి రాష్ట్ర ప్రభుత్వం లాంఛనంగా పుష్కరాలను నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రాణహిత పుష్కరాలు ప్రారంభమై గురువారానికి సంవత్సరం. దీంతో మొదటి 12 రోజులను ఆది పుష్కరాలని, చివరి 12 రోజులను అంత్యపుష్కరాలని అంటారు. కానీ అంత్య పుష్కరాల విశిష్టతపైన క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఏడాది పూర్తయి చివరి 12 రోజులు కూడా పుష్కరాలు ప్రారంభంలో 12 రోజుల ఎలా పుణ్యస్నానాలు చేస్తే పుణ్యఫలం ఉందో చివరి 12 రోజులు కూడా పుణ్యస్నానాలు చేస్తే అలాగే ఫలితం ఉంటుందని పండితులు చెబుతున్నారు. గతేడాది మంచిర్యాల జిల్లా అర్జునగుట్ట, కాళేశ్వరం, మహారాష్ట్రలోని సిరొంచ వద్ద పుష్కరాలను అక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు వేదపండితులతో వైభవంగా నిర్వహించారు. కానీ ఈ అంత్యపుష్కరాలపై భక్తులకు ప్రచారం లేకపోవడంతో అంతా మర్చిపోయారనే విమర్శలు వస్తున్నాయి. దేవాదాయశాఖ అధికారులు తెలిసినా అంత్యపుష్కరాలపై ఫోకస్ చేయలేకపోతున్నట్లు సమాచారం. గతేడాది ఈ మూడు పుష్కరఘాట్లలో సుమారుగా 12రోజుల్లో 10లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు చేశారని అధికారుల అంచనా. కాళేశ్వరంలో ఏర్పాటైన పాలకవర్గం కూడా సైలెంట్‌గా ఉందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో కనీసం గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిణి సరస్వతీ నదులు కలిసే చోట చివరి 12రోజులు నదులకు వేదపండితులతో పూజా కార్యక్రమాలు నిర్వహించాలని, చీర సారెలతో హారతి కార్యక్రమం నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.

నీటి కొలత పరికరాల పరిశీలన


టెలిమీటర్‌ను పరిశీలిస్తున్న ఈఈ

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద వరద నీటిమట్టాన్ని కొలిచే టెలిమీటర్‌ను కేంద్ర జల వనరుల కేంద్రం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈ.వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. వాజేడు మండలం పేరూరులో ఘాట్ వద్ద గోదావరి పరిస్థితిని పరిశీలించారు. వరదల ప్రవాహాన్ని కొలిచే మీటర్ల పనితీరును చూశారు. ఈ మీటర్ల వల్ల వరద ఏ మేరకు పెరుగుతుందని, ఎంత ప్రవాహం ఉందని హెడ్ ఆఫీస్, స్థానిక అధికారులకు సమాచారం వెళ్లే విధంగా అమర్చారు. వీటి పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రతి నెలలో ఒకసారి అధికారులు వస్తారని ఈఈ తెలిపారు.

మత్స్య సంపదతో గిరిజనాభివృద్ధి

- పైలెట్ ప్రాజెక్టు కింద నాలుగు సంఘాలు ఎంపిక
- ఎంఎస్ఎంఈ ద్వారా యూనిట్ల మంజూరు
- సమీక్ష సమావేశంలో ఐటీడీఏ పీఓ అంకిత్


మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: గిరిజన మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలతో చేపల వ్యాపారం గిరిజనాభివృద్ధికి తోడ్పడుతుందని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పరిధిలోని గంగారం, నర్సింహాసాగర్, తుపాకులగూడెం, కర్లపల్లి సంఘాల సభ్యులతో పీఓ సమీక్షించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ములుగు జిల్లా మత్స్యశాఖ ద్వారా గంగారం, నర్సింహాసాగర్, తుపాకులగూడెం, కర్లపల్లి నాలుగు గిరిజన మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలకు పైలెట్ ప్రాజెక్టు కింద ఎంఎస్ఎంఈ పథకం ద్వారా చేపలు పట్టేందుకు వలలు, తెప్పలు, ఇంజన్ బోట్లను ఇవ్వనున్నట్లు చెప్పారు. చేపలను రవాణా చేసేందుకు శీతలీకరణ వాహనాలు, గిరిజన సహకార సంఘాలతో ఫిష్ స్టాల్స్ ఏర్పాటు చేయించనున్నట్లు తెలిపారు. సంఘం సభ్యులు అవకాశాలను సద్వినియోగం చేసుకొని అందరికీ ఆదర్శంగా ఎదగాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ వసంతరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, జిల్లా మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ రమేష్‌తోపాటు, సిబ్బంది, గిరిజన మత్స్యపారిశ్రామిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కారుకొండ సడాలమ్మను దర్శించుకున్న నాగజ్యోతి


సడాలమ్మను దర్శించుకుంటున్న నాగజ్యోతి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని ఆదివాసీ ఇలవేల్పు అయిన కారుకొండ సడాలమ్మను జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి గురువారం దర్శించుకున్నారు. భక్తజనంతో కలిసి నాగజ్యోతి నృత్యాలు చేస్తూ అమ్మవారిని సాదరంగా గద్దెల వద్దకు తీసుకువచ్చారు. వనదేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిమ గల తల్లి కారుకొండ సడాలమ్మ అన్నారు. రానున్న రోజులలో ఈ జాతరకు ప్రభుత్వ గుర్తింపు లభించే విధంగా ప్రయత్నిస్తానని చెప్పారు. ఆమెవెంట తాడ్వాయి మండల యువజన విభాగం అధ్యక్షుడు సురేష్, పూజారులు ఎట్టి ప్రకాశ్, ఎట్టి మహేష్, ఎట్టి సమ్మయ్య, మాజీ సర్పంచ్ బడే రాంబాబు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావును కలిసి వస్తున్న నాయకులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అసోషియేషన్ డిస్కం కార్యదర్శి బక్క దానయ్య కోరారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ అతిథి గృహంలో గురువారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ డిస్కం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం జాప్యం చేస్తుందన్నారు. సొంత ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎన్పీడీసీఎల్ యాజమాన్యం విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్దదైన 125 అడుగుల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్ రావును కలిసి సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో అసోషియేషన్ డిస్కం ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, నాయకులు స్వదేశ్ కుమార్, లక్ష్మీనారాయణ, కృష్ణ, రవి, చలపతి, విజయ్ రాజ్, రాజు, శ్యామ్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

మార్కెట్‌లో రైతుల గోస

అన్నదాతలకు లాట్ ఐడీలు ఇవ్వని సిబ్బంది

- జీరో దందా కోసమేనని ఆరోపణలు
- అడ్తిదారుల కనుసన్నల్లోనే మిర్చి అమ్మకాలు
- ప్రేక్షక పాత్రలో మార్కెట్ పాలకవర్గం

సాక్షి పరిశీలన



వరంగల్ మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు.

వరంగల్: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రైతులకు పంటను అమ్ముకోవడంలో అండగా ఉండేందుకు మార్కెట్ కమిటీలు, రైతు సమన్వయ సమితిలు ఏర్పాటు చేసి కన్వీనర్లను నియమిస్తున్నా.. వారు పెద్ద పెద్ద వాహనాల్లో అధికారదర్పం ఒలగబెటడమే కాని ఏనాడు మార్కెట్‌లో రైతుల కష్టాలను పట్టించుకున్న దాఖలాలు లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో గురువారం ‘సాక్షి’ పరిశీలించి లాట్ ఐడీలపై రైతులను ప్రశ్నించగా మెజార్టీ రైతుల నుంచి ఇవ్వలేదన్న సమాధానం వచ్చింది.

ప్రతిరోజూ 35నుంచి 50వేల బస్తాల మిర్చి

సీజన్‌లో మిర్చి బస్తాలను గ్రామాల నుంచి రైతులు ఉదయాన్నే మార్కెట్‌కు తీసుకురావడంతో అలసిపోతున్నారు. అడ్తిదారుని గుమస్తాలు రాగానే తమ బస్తాలను ఆయనకు అప్పగించి కాలకృత్యాలు తీర్చుకోవడం, టీ, టిఫిన్ చేయడానికి వెళ్లిన సమయంలో అక్కడ జరిగే తంతును పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. ప్రతిరోజూ ఉదయం 7.30గంటలకు మిర్చి ధరను నిర్ణయించేందుకు జెండా పాట పాడి గరిష్ట ధరకు ఒక లాట్ ఖరీదుదారుడు కొనుగోలు చేస్తారు. అనంతరం మార్కెట్‌లోని సేట్లు ఇంటికి, మార్కెట్ సిబ్బంది యార్డుల్లోకి, అధికారులు ఆఫీసుల్లోకి వెళ్లిపోవడం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం మిర్చి దాదాపు ప్రతిరోజూ 35 నుంచి 50వేల బస్తాలు వస్తున్నాయి. యార్డుల్లోకి వచ్చిన మిర్చి బస్తాలు అప్పుడప్పుడు మాయం అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నా.. సీసీ కెమెరాల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేదని తెలుస్తోంది. కొన్నిచోట్ల కెమెరాలు పనిచేస్తున్నందున కొన్ని బస్తాలు మాయమైన సందర్భంలో ఇరు వర్గాలను సమన్వయం చేసి మార్కెట్ అధికారులు సమస్యను పరిష్కరిస్తున్న పరిస్థితి ఉంది.

జీరో దందాకు రాచమార్గం

రైతులకు లాట్ ఐడీలు జారీ చేస్తే తప్పనిసరిగా తూకం వేసి పీవోఎస్ మిషన్లలో ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అందువల్ల జీరో దందాకు అవకాశం లేకుండా పోతుంది. దీంతో కొంత మంది ట్రేడర్స్, వారి గుమస్తాలు, మార్కెట్‌లోని కొంత మందితో లోపాయికారి ఒప్పందం చేసుకుని ఐడీల జారీలో అలసత్వం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. కింది స్థాయి సిబ్బంది లాట్ ఐడీలు ఇచ్చారా.. లేదా అన్న విషయాలను యార్డుల్లో అధికారులు తిరిగితే తెలుస్తుంది. అధికారులు మాత్రం యార్డు ఆఫీసులకే పరిమితం కావడంతో మొత్తం దడవాయిలు, హమాలీలు, గుమస్తాల కనుసన్నల్లోనే గుట్టుగా ఈ వ్యవహారం సాగుతున్నట్లుగా తెలిసింది.



లాట్ ఐడీ(నమూనా)

లాట్ ఐడీల్లో అన్ని వివరాలు

రైతులు మార్కెట్‌కు మిర్చి బస్తాలు తెచ్చి యార్డుల వద్ద పెట్టగానే మార్కెట్ సిబ్బంది లాట్ ఐడీలు తప్పకుండా జారీ చేయాల్సి ఉంటుంది. లాట్ ఐడీ ఇస్తే అందులో రైతు పేరు, అడ్తిదారుని పేరు, తెచ్చిన మిర్చి రకం, ఎంత సరకు తెచ్చారనే వివరాలు ఉంటాయి. కాంటాలు పెట్టే సమయంలో లాట్ ఐడీలో పేర్కొన్న బస్తాలు ఉన్నాయా..రకం ..ఇతరత్రా విషయాలను రైతులు గమనించే అవకాశం ఉంటుంది. మార్కెట్ ఉన్నతాధికారులు లాట్ ఐడీలు పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కింది స్థాయి అధికారులు, సిబ్బందితో లక్ష్యం నెరవేరడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న పాలకవర్గం ప్రేక్షకపాత్ర పోషించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లాట్ ఐడీలు ఇవ్వలేదు..



15 బస్తాల మిర్చి మార్కెట్‌కు తీసుకొచ్చాను. నాకు లాట్ ఐడీ ఇవ్వలేదు. ధరలు అయ్యాయి. ఇంకా కాంటాలు కాలేదు. గత ఏడాదిలో ఒక సారి లాడ్ ఐడీ ఇచ్చారు. ఈ సీజన్‌లో రెండు సార్లు మార్కెట్‌కు మిర్చి అమ్మేందుకు వచ్చినా ఐడీలు ఇవ్వలేదు.

- యాకయ్య, లడాయిగడ్డ, కొత్తగూడ

అంతా సేటుకే ఎరుక..



46 బస్తాల సన్న మిర్చి మార్కెట్‌కు తీసుకొచ్చాను. ధర క్వింటాకు రూ.20,300లు అన్నారు. ఇంకా కాంటాలు కాలేదు. లాట్ ఐడీ ఇవ్వలేదు. మిర్చి బస్తాలు తెచ్చి సేటుకు అప్పగించడం వరకే తెలుసు. ఇవన్నీ ఏమి తెలియదు.

- వీరన్న నాయక్, గోప్యాతండా,కేసముద్రం

ధర అడ్తిదారులకే తెలుసు..



మార్కెట్‌కు 8 బస్తాల మిర్చి తీసుకొచ్చాను. లాట్ ఐడీ ఇవ్వలేదు. అసలు ఎప్పుడూ కూడా లాట్ ఐడీలు ఇవ్వలేదు. మిర్చి బస్తాలు కాంటాలు కాలేదు. ధర కూడా అడ్తిదారులకే తెలుసు.

- రాజఅయిలు, గొల్లపల్లి, గణపురం

బీజేపీ నిరుద్యోగ మార్చ్ హాస్యాస్పదం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

న్యూశాయంపేట: తెలంగాణ అభివృద్ధి పట్టని బీజేపీ నాయకులు రేపు హనుమకొండలో నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ కార్యదర్శులు, ముఖ్యనాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విభజన హామీలు నెరవేర్చని కేంద్రాన్ని నిరుద్యోగులు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇటీవల చేపట్టిన ప్రజాపోరు యాత్ర వల్లే కేంద్రంలో, రాష్ట్రంలో విభజన హామీలపై చర్చ మొదలైందన్నారు. రానున్న రోజుల్లో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని కూడా చేపట్టి విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా 12రోజుల పాటు విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ చేపట్టిన ప్రజాపోరు యాత్రలో పాల్గొన్న 200 మంది నాయకులు కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలను వెంకట్‌రెడ్డి అందజేశారు. ఈ సమావేశంలో నాయకులు విజయసారధి, నేదునూరి జ్యోతి, మేకల రవి, కర్రె భిక్షపతి, రాజారెడ్డి, రాజ్‌కుమార్, మల్లికార్జున్‌రావు, రమేశ్, తోట భిక్షపతి, ఎల్లేశ్, ఆదరి శ్రీనివాస్, సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘యువిక-2023’కి నిఖిల్ ఎంపిక

- అభినందించిన డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్



కాశీబుగ్గ: బాల్యదశలోనే సైన్స్, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఆసక్తి పెంచి విద్యార్థులను ఈ రంగాల వైపు మళ్లించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈ వేసవి సెలవుల్లో చేపడుతున్న యువిక-2023 కార్యక్రమానికి వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బట్టు నిఖిల్ ఎంపికయ్యాడు. దేశ వ్యాప్తంగా కేవలం 9వ తరగతి విద్యార్థుల కోసమే ఏర్పాటు చేసిన ఈ యువిక (యువ విజ్ఞాన కార్యక్రమం)లో రెండు వారాల పాటు వచ్చే మే నెలలో దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నాలుగు వివిధ కేంద్రాల్లో మొత్తం 350 మంది విద్యార్థులకు స్పేస్ సైన్స్, స్పేస్ టెక్నాలజీలలో శిక్షణ ఇస్తారు. దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో 350మంది విద్యార్థుల్లో 22వ ర్యాంకు సాధించి నిఖిల్ ఎంపిక కావడం పట్ల డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేసి నిఖిల్‌ను అభినందించారు. ఈ శిక్షణలో నిఖిల్‌కు అయ్యే పూర్తి ఖర్చులు ఇస్రో భరించనుంది.

ఎద్దు పొడిచి బీటెక్ విద్యార్థి మృతి

- మేతకు ఎడ్లను తీసుకెళ్లగా ఘటన



భానుప్రకాశ్(ఫైల్)



భానుప్రకాశ్ మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కేసముద్రం: మేత మేపేందుకు తీసుకెళ్లిన ఎద్దు పొడవడంతో ఓ బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. ఈ విషాదకరమైన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పనికరి పద్మ, కొమురమల్లు దంపతులకు కుమారుడు భానుప్రకాశ్(19), కూతురు ఆలేఖ్య ఉన్నారు. భానుప్రకాశ్ హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇటీవల కాలేజీ నుంచి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు పని నిమిత్తం ఇంటివద్ద ఉండగా, తమకున్న రెండు ఎడ్లను మేపేందుకు భానుప్రకాశ్ పంటచేను వద్దకు తీసుకెళ్లాడు. ఎద్దు మూతికి కట్టిన బుట్టి విప్పే క్రమంలో ఆ ఎద్దు ఛాతిభాగంలో పొడవడంతో అతను కింద పడిపోయి, గట్టిగా కేకలు వేశాడు. కొంత దూరంలో ఉన్న అతడి పెదనాన్న యాకమల్లు పరుగెత్తుకుంటూ అక్కడికి వచ్చి భానుప్రకాశ్‌ను బైక్‌పై కేసముద్రంస్టేషన్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడినుంచి మహబూబాబాద్‌లోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

కాలేజీకి వెళ్లినా బతికేటోడు..

బీటెక్ ఫస్టియర్ చదువుతున్న భానుప్రకాశ్ గురువారం ఉదయం కాలేజీకి వెళ్లాలనుకున్నాడు. కొత్త డ్రెస్ కొనుక్కొని శుక్రవారం వెళ్లొచ్చని ఇంట్లో చెప్పడంతో ఇంటి వద్ద ఉండిపోయాడు. అతను ఒకవైపు చదువుకోవడంతోపాటు, తన వంతుగా వ్యవసాయ పనులను చేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉండేవాడు. ఈ మేరకు ఎడ్లను మేపేందుకు వెళ్లిన అతన్ని ఎద్దుపొడవడంతో మృతిచెందాడు. కాలేజీకి వెళ్లినా బతికేటోడివంటూ కుమారుడి మృతదేహంపై పడి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు అక్కడున్న వారందరిని కంటతడిపెట్టించింది. భానుప్రకాశ్ కుటుంబాన్ని గురువారం రాత్రి ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వరికోత మిషన్ నడపడానికి వెళ్లి..



ఆంజనేయులు(ఫైల్)

బచ్చన్నపేట: మండల పరిధిలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వరికోత మిషన్ నడపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు సాగర్ కాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుక్కసావు ఆంజనేయులు(40) డ్రైవింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారం రోజుల క్రితం ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం గొల్లపూడికి చెందిన ఏజెంటు చల్ల కృష్ణ ఇంటికి వరికోత మిషన్ నడపడానికి వెళ్లాడు. పనిలో భాగంగా గురువారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం వద్ద వరికోతలు కోస్తున్నాడు. విరామ సమయంలో సాగర్ కాల్వపై స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడ్డాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో అండర్ టన్నెల్‌లో చిక్కుకుని శ్వాస ఆడక మృతి చెందాడు. ఈ సమాచారం మేరకు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం చేసిన అనంతరం స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతునికి భార్య మమత, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్..



హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ (ఫైల్)

దామెర: చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ మృతిచెందాడు. ఈ ఘటన దామెర మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ హంటర్ రోడ్డుకు చెందిన గుగ్గిళ్ల ప్రసాద్ (53) ములుగు జిల్లా కేంద్రంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 10న రాత్రి విధులు ముగించుకొని హనుమకొండకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ఊరుగొండ సమీపంలో జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద గుంతలో ద్విచక్ర వాహనంతో సహా పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్రగాయాలు కాగా వెంటనే స్థానికుల సాయంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. అక్కడినుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు దామెర పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రసాద్ అవయవాలు జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేశారు.

వడదెబ్బతో ఒకరు..



భిక్షపతి (ఫైల్)

నెక్కొండ: వడదెబ్బతో ఒకరు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నెక్కొండకు చెందిన దేవులపల్లి భిక్షపతి (43) వడదెబ్బకు గురై వాంతులు, విరేచనాలు కావడంతో బుధవారం రాత్రి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స అందించాలని వైద్యులు సూచించడంతో నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి భిక్షపతి మృతి చెందాడు. పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు భిక్షపతి మృతదేహాన్ని సందర్శించారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్

- రూ.10 లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీతారాం

జనగామ రూరల్: మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాదించాలని స్నేహితుడి ఇంట్లో ఓ వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. ఆ నిందితుడిని గురువారం పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీసీపీ సీతారాం వివరాలు వెల్లడించారు. బచ్చన్నపేట గ్రామానికి చెందిన సందెల రాజేష్(అలియాస్ రాజు) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. వచ్చే ఆదాయం సరిపోవక పోవడంతో చెడు వ్యసనాలకు అలవాటుపడ్డాడు. భవాని నగర్‌లో నివాసం ఉంటున్న రాజేష్ ఈ నెల 9వ తేదిన తన స్నేహితుడు వంశీ ఇంటి తాళం పగులగొట్టి రూ.10లక్షలు ఎత్తుకెళ్లాడు. ఈ విషయంపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయగా డీసీపీ సూచన మేరకు ఏసీపీ దేవేందర్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ శ్రీనివాస్, ఎస్సై రఘుపతి, సృజన్ సిబ్బందితో జనగామ బస్టాండ్ వద్ద నిందితుడిని పట్టుకొని దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభ చూపించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, నర్మెట సీఐ నాగబాబు, ఎస్సై రఘుపతి, సృజన్, సల్మాన్ పాషా, శ్రీనివాస రాజు, కానిస్టేబుళ్లు మహేష్, రామన్న, కర్ణాకర్, అనిల్‌కుమార్, కిరణ్‌కుమార్‌లను వారు అభినందించారు.

బట్టల దుకాణంలో షార్ట్ సర్క్యూట్

- సుమారు రూ.8 లక్షల ఆస్తినష్టం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తాలోని ఎంపి గుప్తా రెడీమేడ్ బట్టల దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో స్వల్పంగా దగ్ధమైంది. దుకాణ యజమాని సోదరుడు అభిషేక్ అగర్వాల్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగా గురువారం ఉదయం 10 గంటలకు దుకాణం తెరిచి మెయిన్ ఆన్ చేశారు. కొద్ది సేపటికే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనరేటర్ ఆన్ చేశారు. తిరిగి విద్యుత్ రావడంతో దుకాణంలోని మూడో అంతస్తులోని గోడౌన్‌లో మంటలు రావడాన్ని సిబ్బంది గమనించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు నేతృత్వంలో సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పి వేశారు. ఈ నెలలో రంజాన్ పండుగ ఉండడంతో కొత్త స్టాక్ తెప్పించామని వివరించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 8 లక్షల ఆస్తినష్టం జరిగిందని అభిషేక్ అగర్వాల్ తెలిపారు.

పట్టుదలతో చదివితేనే బంగారు భవిష్యత్



మంత్రిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం




విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఘనంగా సీజేఐటీ సిల్వర్ జూబ్లీ వేడుకలు

జనగామ: విద్యార్థులు పట్టుదలతో చదువుకుని బంగారు భవిష్యత్ పొందాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ మండలం యశ్వంతాపురం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రాత్రి బిషప్ ఉడుముల బాల అధ్యక్షతన జరిగిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువును ఆషామాషీగా తీసుకుంటే, ఆగమైపోతారన్నారు. కళాశాలకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని, బీటీ రోడ్డు సైతం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదువుకునే విద్యార్థులు సమాజానికి ఆదర్శవంతులన్నారు. బిషప్ ఉడుముల బాల మాట్లాడుతూ సీజేఐటీలో 25 ఏళ్ల కాలంలో చదువుకున్న వేలాది మంది విద్యార్థులు ప్రపంచంలోనే అనేక దేశాల్లో స్థిరపడ్డారన్నారు. కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సీజేఐటీ ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తుందన్నారు. వరంగల్ నిట్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ మంజూరు హుస్సేన్, సీజేఐటీ డైరెక్టర్ అగస్టీన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 25 వసంతాలు పూర్తి చేసుకున్న ఇంజనీరింగ్ కళాశాల్లో సీజేఐటీ ఒక్కటిగా నిలిచి పోతుందన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే, విద్యా వేత్తలను కాలేజీ నిర్వాహకులు శాలువా, మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉత్సవాల కన్వీనర్లు బి.స్వప్న, కరుణాకర్, ఏఎస్ రావు, ప్రణయ్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

నర్సంపేట రూరల్ : ఉరివేసుకొని ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన నర్సంపేట పట్టణంలో గురువారం జరిగింది. ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణం వరంగల్ రోడ్డులోని ఆర్టీసీ కండక్టర్ రేసు శ్రీనివాస్ (51) నర్సంపేట డిపోలో విధులు నిర్వహించి కొన్ని సంవత్సరాల క్రితం తొర్రూర్ డిపోకు ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లారు. అయితే శ్రీనివాస్‌కు ఆరోగ్య స్థితి బాగలేక పోవడంతో విధులకు వెళ్లలేకపోతున్నాడు. ఈ క్రమంలో గత నెల 13న విధుల నుంచి తొలగించారు. దీంతో అనారోగ్య, విధుల నుంచి తొలగించడంతో మనోవేదనకు గురై శ్రీనివాస్ ఇంట్లో గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.